# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మార్చి 02 ఆదివారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 220

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న
# సస్పెన్షన్



కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేస్తున్నట్లు పీసీసీ క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ప్రకటించారు.

హైదరాబాద్: కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేస్తున్నట్లు పీసీసీ క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ఆయన శనివారం పార్టీ తరఫున ఉత్తర్వులు జారీ చేశారు. 'పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఎందుకు చర్యలు తీసుకోరాదో చెప్పాలని గత నెల 5న మీకు షోకాజ్ నోటీసు ఇచ్చాం. ఇంతవరకు మీ నుంచి ఎలాంటి సమాధానం రాకపోగా ఇంకా మీరు కాంగ్రెస్ వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మిమ్మల్ని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని కమిటీ నిర్ణయించింది' అని తీన్మార్ మల్లన్నను ఉద్దేశిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు. పార్టీ నియమాలను అతిక్రమిస్తే ఊరుకునేది లేదని, మల్లన్నను ఎన్నోసార్లు హెచ్చరించినా మారలేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బీసీ కులగణన ప్రతులను మల్లన్న

చించివేయడంపై ఏఐసీసీ సీరియస్ అయిందని, కులగణనపై మల్లన్న చేసిన వాఖ్యలు తప్పు అని ఆయన పేర్కొన్నారు.

# ఖనిజాల అక్రమ తవ్వకాలపై
# ఉక్కుపాదం



సరైన ధరలకు ఇసుకను సరఫరా చేస్తే.. వినియోగదారులు అక్రమ రవాణాపై ఆధారపడరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) అధికారులకు సూచించారు.

**ఎవరినీ ఉపేక్షించవద్దు**
**హైదరాబాద్‌కు మూడు వైపులా**
**ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయండి**
**సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్: సరైన ధరలకు ఇసుకను సరఫరా చేస్తే.. వినియోగదారులు అక్రమ రవాణాపై ఆధారపడరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇసుకతో పాటు ఖనిజాల అక్రమ తవ్వకాలు, సరఫరాపై ఉక్కుపాదం మోపాలని మైనింగ్‌శాఖకు స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు సరఫరాపై పలు సూచనలు చేశారు. "నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌తో పాటు ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు టీజీఎండీసీ ద్వారానే ఇసుక సరఫరా చేసే విధంగా చూడాలి. పెద్ద నిర్మాణ సంస్థలకు కూడా ఈ సంస్థ నుంచే ఇసుకను అందించాలి. గనులశాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపై విధానపరమైన నిర్ణయాలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మైనర్ ఖనిజాల బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలి" అని సీఎం ఆదేశించారు. గత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు

అడ్డుకట్ట పడిన విధానాన్ని, పెరిగిన ఆదాయాన్ని అధికారులు సీఎంకు

వివరించారు. టీజీఎండీసీ చైర్మన్ అనిల్‌కుమార్, ఎండీ సుశీల్‌కుమార్, సీఎం సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ శశాంక, ముఖ్య కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్
# రాజకీయాలు



హామీలు అమలు చేయలేక తనపై విమర్శలు

అబద్దాలు ప్రచారం చేస్తే ప్రజలను నమ్మరు

సిఎం రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఘాటు విమర్శలు

2లో



# కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే అగ్రస్థానంలో తెలంగాణ

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. "రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయనే శ్రీరామరక్ష.

హైదరాబాద్, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. "రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయనే శ్రీరామరక్ష. గులాబీ జెండా ఎగిరితేనే తెలంగాణ గెలుస్తుంది" అని పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండలం మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డితో పాటు భాజపా, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు కార్యకర్తలు శనివారం భారాసలో చేరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వారికి పార్టీ కండువా కప్పి భారాసలోకి ఆహ్వానించారు. మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... 'రైతులకు రుణమాఫీ కాలేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు. పెన్షన్లు పెంచలేదు. ఆడబిడ్డలకు తులం బంగారు ఇవ్వలేదు. ఒక్క కొత్త పథకమూ ప్రారంభించలేదు. కానీ ఏడాదిలో రూ.లక్షన్నర కోట్ల అప్పు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణ.. కాంగ్రెస్ పాలనలో విధ్వంసం, అరాచకాలతో కుప్పకూలింది. హైడ్రా, మూసీ పేరిట కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని దెబ్బతీశారు. రంగారెడ్డి-పాలమూరు ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం పనులు చేస్తే చేవెళ్లకు నీళ్లొస్తాయి. కేసీఆర్‌కు పేరొస్తుందనే అసూయతో ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. వీరిపాలనలో 450 మంది రైతులు, ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. కేసీఆర్ పాలనలో నీళ్లు, నిధులు, నియామకాలన్న తెలంగాణ ఉద్యమ నినాదం సాకారమైంది. ఇంటింటికీ మంచినీళ్లు, పొలాలకు సాగునీరు తెచ్చాం. కాళేశ్వరంతో పాటు మిగతా సాగునీటి పథకాలతో వరి ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.



## కొచ్చి విమానాశ్రయం తరహాలో
# మామునూరు ఎయిర్‌పోర్టు

వరంగల్‌కు ఒక సంపదగా జిల్లాలోని మామునూరు విమానాశ్రయం రూపుదిద్దుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్: వరంగల్‌కు ఒక సంపదగా జిల్లాలోని మామునూరు విమానాశ్రయం రూపుదిద్దుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొచ్చి విమానాశ్రయం తరహాలో ఈ ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలని, విమాన రాకపోకలతో పాటు ఇతర కార్యకలాపాలు జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి.. మామునూరు ఎయిర్‌పోర్టుపై సమీక్ష నిర్వహించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఎంపీలు కావ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అసంపూర్తిగా ఉన్న భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. విమానాశ్రయ ఆకృతిని త్వరగా సిద్ధంచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మామునూరు విమానాశ్రయానికి కేంద్రం అనుమతి ఇచ్చేలా కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలు ధన్యవాదాలు తెలిపారు.



2లో

# మణిపూర్‌లో
## దారికొస్తున్న పరిస్థితులు

8 నుంచి రవాణాకు అనుమతులు

ఉన్నతస్థాయిలో సమీక్షించిన

హోంమంత్రి అమిత్ షా

# మల్టీప్లెక్స్‌లకు ఊరట

**16ఏళ్లలోపు పిల్లలకు అనుమతి..**
**తదుపరి విచారణ 17కు విచారణ**

హైదరాబాద్: మల్టీప్లెక్స్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. 16 సంవత్సరాలలోపు చిన్నారులను అన్ని షోలకు అనుమతించాలని ఆదేశించింది. జనవరి 21న ఇచ్చిన ఉత్తర్వులను న్యాయస్థానం సవరించింది. అయితే ప్రీమియర్, బెనిఫిట్ స్పెషల్ షోలకు మాత్రం పిల్లల అనుమతికి హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను ఈ నెల17కు హైకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది. కాగా.. జనవరి 21న 16 ఏళ్ల లోపు పిల్లలు మల్టీప్లెక్స్ థియేటర్‌కు వెళ్లే విషయంపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సమయాబావం లేకపోవడంతో పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారించిన హైకోర్టు పలు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు 16 సంవత్సరాల లోపు చిన్నారులు వెళ్లకూడదు అని ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై అన్ని వర్గాల



అభిప్రాయాలను సేకరించాలని హైకోర్టు ధర్మాసనం కోరింది. అయితే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై మల్టీప్లెక్స్ యాజమాన్యం పోరాడుతోంది. బెనిఫిట్ షో, స్పెషల్ షోలకు అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ తాజాగా 16 ఏళ్లలోపు చిన్నారులను అనుమతించే విషయంలో ఉత్తర్వులను హైకోర్టు సవరణ చేసింది.

16 ఏళ్ల చిన్నారులు థియేటర్‌లోకి వెళ్లే విషయంలో నిబంధనలు విధిస్తే.. సినిమా వసూళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్ సినిమాకు వెళ్లే సమయంలో కుటుంబం మొత్తం వెళ్తుంటారు. ఈ క్రమంలో నిబంధనలు ఉంటే ఫ్యామిలీ వెళ్లే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ఇతర వర్గాల అభిప్రాయాల

సే కరించి కోర్టుకు సమర్పించడంతో న్యాయస్థానం జనవరి 21న ఇచ్చిన ఉత్తర్వులను సవరించింది. అలాగే స్పెషల్ షోలు, బెనిఫిట్ షోలకు

ఎట్టిపరిస్థితిల్లో పర్మిషన్ ఇవ్వబోమని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. ఇదే అంశాన్ని కూడా హైకోర్టు ప్రస్తావిస్తూ తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది.

## ప్రియుడితో కలిసి భర్తపై హత్యాయత్నం ఘటన.. చికిత్స పొందుతూ మృతి



2లో

వరంగల్ నగరంలో ఇటీవల వైద్యుడిపై హత్యాయత్నం కేసు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రియుడిపై మోజుతో భర్త(వైద్యుడు)ను మట్టుపెట్టే పన్నాగంలో భాగంగా హత్యాయత్నం చేయగా.. అతడు చికత్స పొందుతూ మృతిచెందాడు.

వేగుచుక్క

# రేంవత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

**హైదరాబాద్:** ఇచ్చిన హామీలు అమలు చేయలేక చతికిల పడ్డ సిఎం రేవంత్ రెడ్డి తనపై పడి ఏడుస్తున్నాడని, వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని, అబద్దాలు చెప్పినంత మాత్రాన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత వారం రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై.. వ్యక్తిగతంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలకు విరుద్ధంగా బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు.. అవగాహన, అనుభవ రాహిత్యంతో, అసహంతో మాట్లాడుతు న్నారని ఆరోపించారు. తాను కేంద్ర మంత్రిగా చేసిన పనులు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియ చేస్తున్నానని.. కేంద్ర పథకాల్ని తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడంలో ఒక విధానం ఉంటుంది. తెలంగాణలో కేంద్రం చేపట్టిన రూ.10లక్షల కోట్ల విలువైన పనులను ఇప్పటికే వివరించాం. నేను ఇతర కేంద్ర మంత్రులను బెదిరించానని దిగజారుడు మాటలు మాట్లాడారు. కేంద్ర పథకాలను సమర్థంగా అమలు చేయాలని సీఎంలకు ఎన్నో లేఖలు రాశాను. సీఎంలతో సంబంధం లేకుండా రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వ్యక్తిని. దేశంలో నిర్మించే 7 టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చాను. రాష్ట్రానికి ఆర్‌ఆర్‌ఆర్‌ను కేంద్రం మంజూరు చేసింది. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన

బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. వాటిని పక్కన పెట్టి భాజపాపై ఆరోపణలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి



విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేక పోవడంతో కొన్ని అమలు చేయలేక పోయామని పేర్కొన్నారు. 14 నెలల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక తన మీద దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, ఆయన పైన అసంతృప్తి.. ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తుందని కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీని బ్లాక్ మెయిల్ చేసినంత మాత్రాన రేవంత్ రెడ్డి మీద వ్యతిరేకత పోదని కిషన్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి మాట తెలంగాణ ప్రజకు నమ్మే పరిస్థితి లేదు.. తాను అంకిత భావంతో పని చేస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం కోసం కేసీఆర్‌కు 40 ఉత్తరాలు రాశానని.. రేవంత్ రెడ్డికి కూడా ఉత్తరాలు రాశానని అన్నారు. తెలంగాణ రేవంత్ రెడ్డి సొంత జాగీరా.. రేవంత్ రెడ్డి మీద కోపంతో తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటామా.. అని అన్నారు. విలువలకు కట్టుబడి పని చేస్తానని.. చిన్నప్పటి నుండి సిద్దాంతం కోసం పని చేశా.. నీ తాటాకు చప్పుళ్ళకు భయపడనని రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సూచించారు. ఇచ్చిన హామీలు అమలు చేయక తమ మీద దాడి చేస్తున్నారని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదు, మహిళకు 2,500 ఇవ్వలేదు? రైతు భరోసా లేదని పేర్కొన్నారు. లక్ష 66 వేల కోట్లకు పైగా నిధులు మంజూరు చేయాలని రేవంత్ రెడ్డి తనకు రాసిన ఉత్తరంలో పేర్కొన్నారని కిషన్ రెడ్డి తెలిపారు. తమను అడుగుతున్న ప్రాజెక్టుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎంత బ్జడెట్ కేటాయింపు చేసింది..సీనియర్ అధికారులు నవ్వు కుంటున్నారని అన్నారు. ఇంత టైమ్‌లో కేంద్ర ప్రభుత్వం ఇన్ని నిధులు ఏ రాష్ట్రానికి కూడా ఇవ్వలేదని అన్నారు. రెండున్నర నెలలలో ప్రాజెక్టులు అన్నీ మంజూరు అవుతాయా అని ప్రశ్నించారు. రీజినల్ రింగ్ రోడ్డు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్ట్? భూ సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాశామని కిషన్ రెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేవలం వంద కోట్ల రివాల్వింగ్ ఫండ్ పెట్టిందని పేర్కొన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే మెట్రో రెండో దశ సంబంధించిన కేంద్రానికి పంపించారు.. రేవంత్ రెడ్డి మెట్రోను ఆపాలని కేంద్రానికి లేఖ రాశారు.. మార్పులు చేసి పంపిస్తామని చెప్పారన్నారు. మరోవైపు.. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2ను కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయదని కిషన్ రెడ్డి చెప్పారు. రేవంత్ మొఖం చూసో, నేను వద్దంటున్న మెట్రో ఆగదన్నారు. మరోవైపు.. ఏపీలో బీజేపీ సొంతంగా అధికారంలోకి వచ్చిన రోజు మతపరమైన రిజర్వేషన్లను ఎత్తి వేస్తుందని తెలిపారు. ముస్లింలు.. బీసీల రిజర్వేషన్లను తన్నుకు పోతామంటే ఎలా ఊరుకుంటామని అన్నారు. ముస్లిం రిజర్వేషన్‌లను హైకోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. త్రిభాష సూత్రంను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆరోపించారు. హిందీ మాట్లాడాలని బీజేపీ చెప్తుందా అని అన్నారు.

## మహిళా దినోత్సవం రోజున కొత్త పథకాలకు శ్రీకారం

హైదరాబాద్: మహిళా దినోత్సవం రోజున కొత్త పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో సుమారు లక్ష

మంది మహిళలతో సభ నిర్వహిస్తామన్నారు. ఈ సభలో ఇందిరా మహిళా శక్తి పాలసీని సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేస్తారని చెప్పారు. నారాయణపేట జిల్లా మాదిరిగా మిగతా 31జిల్లాల్లోనూ పూర్తిగా మహిళలే పెట్రోలు బంకులు నిర్వహించేలా చమురు సంస్థలతో ఆ రోజున ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుందని సీతక్క చెప్పారు. మహిళా దినోత్సవం నిర్వహణపై అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల కోసం 32 జిల్లాల్లో 64 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్లను సీఎం వర్చువల్ గా ప్రారంభిస్తారన్నారు. వడ్డీలేని రుణాల చెక్కులను సీఎం పంపిణీ చేస్తారని తెలిపారు. ఏడాది కాలంలో ప్రమాదవశాత్తూ మరణించిన 400 మంది మహిళలకు రూ.40 కోట్ల బీమా చెక్కులను సీఎం రేవంత్ ఇవ్వనున్నట్లు సీతక్క వివరించారు. పట్టణాల్లో మహిళా సంఘాలను బలోపేతానికి సీఎం కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని.. సెర్ప్, మెప్మాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి చెప్పారు.

## మణిపూర్‌లో దారికొస్తున్న పరిస్థితులు



న్యూఢిల్లీ:గత రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో అల్లకల్లోలంగా మారిన మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా కేంద్రం కృషి చేస్తోంది. ఇప్పుడు అక్కడ రాష్ట్రపతి పాలన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలోని భద్రతా పరిస్థితులపై ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి..కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మార్చి 8నుంచి రాష్ట్రంలోని అన్ని మార్గాల్లో ప్రజల రాకపోకలు స్వేచ్ఛాయుతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అడ్డంకులు సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. హింసతో రగిలిపోతున్న ఈశాన్య రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించడంపై అమిత్ షా అధికారులతో చర్చలు జరిపినట్లు సమాచారం. దిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో మణిపుర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్మీ, పారామిలటరీ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత అక్కడి పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి. దాదాపు రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో రగులుతున్న మణిపుర్‌లో కల్లోల పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన కేంద్ర ప్రభుత్వం అధికారాలన్నింటినీ అక్కడి గవర్నర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఏడు రోజుల్లోగా అప్పగించాలని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు గవర్నర్ అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఏడు రోజులలో దాదాపు 300 ఆయుధాలను ప్రజలు ప్రభుత్వానికి అప్పగించినట్లు సమాచారం.

## నేరం జరిగిన వందరోజుల్లోనే శిక్ష అమలు

అనంతపురం: నేరం జరిగిన వంద రోజుల్లో శిక్ష అమలు చేయడమే లక్ష్యం అని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. శనివారం అనంతపురంలో జరిగిన ఎస్సైల పాసింగ్ అవుట్ పరేడ్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇండోర్, అవుట్ డోర్ విభాగాల శిక్షణలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన ఎస్సైలను మెడల్, సర్టిఫికెట్, చీఫ్ మినిస్టర్ పిస్టల్ తో మంత్రి అనిత సత్కరించారు. సివిల్ విభాగం ఫైరింగ్ లో ప్రతిభ చాటిన ఎస్సైలను సత్కరించారు. సివిల్ విభాగంలో ప్రతిభ చాటిన విజేతలకు ట్రోఫీ అందజేశారు. ఏపీఎస్పీ విభాగాల్లోని ఇండోర్, అవుట్ డోర్,ఆల్ రౌండ్ ప్రతిభ కనబరచిన ఎస్సైలను అభినందించారు. ప్రజలు, పోలీసుల భాగస్వామ్యంతో లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. ప్రజల భద్రత విషయంలో పోలీసుల పాత్ర వెలకట్టలేనిదని చెప్పారు. 394 మంది ఎస్సైలు శిక్షణ పూర్తి చేసుకోవడం హోంశాఖకు అదనపు బలం అని ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. శిక్షణలో పాల్గొని కష్టాలను లెక్కచేయకుండా అత్యుత్తమ ప్రతిభ చాటిన అందరికీ అభినందనలు తెలిపారు. ' మీ కుటుంబ సభ్యురాలిగా మీరు సాధించిన విజయంపట్ల గర్విస్తున్నా ' అని చెప్పారు. పోలీస్ శాఖలో ప్రజలకు సేవ చేస్తున్న ప్రతి పోలీస్ తన తోబుట్టువుతో సమానం అని అన్నారు. ఆర్మీ, పోలీస్ విభాగాలకు పంపే కుటుంబాల త్యాగం అనిర్వచనీయమని తెలిపారు. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే ధ్యేయంగా అహర్నిశలు శ్రమించే పోలీసులందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. ఖాకీ చొక్కా వేసుకోవడం గర్వంతో పాటు బాధ్యత అని చెప్పారు. ప్రజలకు కష్టమొస్తే దేవుడి తర్వాత పోలీసుల దగ్గరకు వస్తారని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని సైబర్ నేరాలను అరికట్టాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారిలో 97మంది మహిళా ఎస్సైలు ఉండడం పట్ల గర్వపడుతున్నా నని అన్నారు. చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. దాడి, వేధింపులు జరిగిన వంద రోజుల్లో శిక్షపడే వ్యవస్థను తీసుకువస్తామని వెల్లడించారు. గంజాయి, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ ను నెలకొల్పుతామని మంత్రి అనిత అన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లో లక్ష కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ప్రకటించారు. ఏఓబీ సరిహద్దుల్లోని వేల ఎకరాల గంజాయి సాగును ప్రక్షాళన చేశామన్నారు. పోలీసుల సంక్షేమంపై ప్రత్యేకంగా ప్రభుత్వం శ్రద్ధ పెడుతుందన్నారు. లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ప్రతి పోలీస్ స్టేషన్ కి 2 డ్రోన్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### పార్టీ నియమాలు పాటించనందుకు మల్లన్న సస్పెండ్ చేసిన కాంగ్రెస్ పార్టీ

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేశారు. ఈమేరకు ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించడమే కాకుండా బీసీ కులగణన ప్రతులు చించడంపై ఆ పార్టీ అధిష్టానం సీరియస్ అయింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ మల్లన్నకు ఫిబ్రవరి 5న షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కోరినా.. మల్లన్న నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు మల్లన్నను సస్పెండ్ చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదన్నారు. మల్లన్నను ఎన్నో సార్లు హెచ్చరించినా మార్పు రాలేదన్నారు. బీసీ కులగణన ప్రతులు చించడంపై ఏఐసీసీ సీరియస్ అయిందన్నారు. మల్లన్న చేసిన వాఖ్యలు చాల తప్పు అని ఆయన పేర్కొన్నారు.

ఏఐసీసీ నిర్ణయం మేరకే తీన్మార్ మల్లన్న సస్పెండ్ : టీ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెన్షన్‌పై టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. తీన్మార్ మల్లన్న విషయంలో ఏఐసీసీ నిర్ణయం తీసుకుందన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలతోనే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారికి ఇది ఒక హెచ్చరిక అని ఆయన తెలిపారు. భవిష్యత్‌లో ఎవరైనా పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఆ పార్టీ వేటు వేసిన సంగతి తెలిసిందే. తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 5న తీన్మార్ మల్లన్నకు కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ వ్యతిరేక చర్యలపై మల్లన్నను కమిటీ వివరణ కోరింది. ఫిబ్రవరి 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని మల్లన్నకు కమిటీ గడువు ఇచ్చింది. వివరణ ఇవ్వకపోవడంతో తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ పార్టీ వేటు వేసింది.

## రిజర్వేషన్ ఎక్కువగా మాలలే అనుభవించారు : మందకృష్ణమాదిగ

హైదరాబాద్: ఇప్పటి వరకు జనాభా ప్రతిపాదన కాకుండా ఎస్సీలో మాలలే ఎక్కువ రిజర్వేషన్ ఫలాలు అనుభవించారని ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ల సమాన కంపెనీ కోసం తాము వర్గీకరణ ఉద్యమం చేపడితే మాలలు అడ్డుకున్నారని విమర్శించారు. జస్టిస్ షమీ అక్తర్ నివేదిక శాస్త్రీయంగా లేదని గ్రూపుల్లో కులాల చేర్పు సరిగ్గా లేదని, దీనిని సవరించాలన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్సీలలోని నేతకాని, మహార్, ఓలియ దాసరి, మాల దాసరి, మిత్ అయ్యల్‌వార్, డోర్, మంగ్, మాంగ్ గరోడి తదితర కులా లను ప్రత్యేక గ్రూపులో కాకుండా గ్రూపు-3లో చేర్చారని, మాలల ఒత్తిడి వల్లనే ఇది జరిగిందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణలో అన్ని కులాలకు న్యాయం జరగాలన్నదే తన లక్ష్యమన్నారు. ఎస్సీలలోని అన్ని కులాలకు తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రా లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ వెంకటేష్ మెహతా మాట్లాడుతూ నేతకాని కులస్థులను ప్రత్యేక గ్రూపులో చేర్చాలని, మాలలతో కలిసి ఉండమని అన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన నేతలు బి.దీపక్‌కుమార్, పృథ్వీరాజ్‌యాదవ్, దుర్గం రాజేష్, రాంబాబు, బాలాజీ, చంద్రశేఖర్, సోమయ్య, కిష్టయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## అశాస్త్రీయ విభజన....కేంద్రం చోద్యం !

ఉమ్మడి ఎపి విభజన వల్ల రెండు కుటుంబాలు బాగుపడ్డాయి. దాదాపు ఓ పదిహేను లక్షల కోట్ల అప్పులు రెండు రాష్ట్రాల నెత్తిన పడ్డాయి. బాగుపడ్డది మాత్రం కెసిఆర్ కుటుంబం, జగన్ కుటుంబం మాత్రమే. విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన దుందుడుకు చర్యల కారణంగా అనేకానేక సమస్యలు ఏర్పడ్డాయి. పదేళ్లు దాటినా సమస్యలు కొలిక్కి రావడం లేదు. విభజన సమయంలో శాస్త్రీయత లోపించింది. ఆస్తులు, అప్పులు ఎలా పంచుకోవాలన్నదానిపైనా స్పష్టత లేకుండా చేశారు. తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్న చందాన విభజన చేసి వదిలి పెట్టారు. ఈ పదేళ్లలో పాలకులు ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేసినా, కేంద్రం దృష్టి పెట్టలేదు. పట్టించుకోలేదు. నిలదీయలేదు. అప్పులు చేసారని పెదవి విరిచారు. అనుమతించిన ఢిల్లీ పెద్దలే ఇప్పుడు చోద్యం చూస్తున్నారు. తరవాత అధికారంలోకి వచ్చిన మోడీ నేతృత్వంలోని బిజెపి కూడా చిత్తశుద్ధితో పనిచేయడం లేదు. సమస్యలు ముదురుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. విభజన చట్టం ప్రకారం.. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ నేతృత్వంలో.. ఒక స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసి..దానికి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అని పేరు పెట్టి.. మార్గదర్శకాలు జారీచేసినా.. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా సాగదీస్తున్నారు. దీంతో.. ఏయేటికాయేడు కృష్ణానదీ జలాల పంపకం సంక్లిష్టంగానే మారుతూనే ఉంది. దశాబ్దం గడిచినా.. ముఖ్యమంత్రులు మారినా చిక్కుముళ్లు వీడింది లేదు. తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయిందే నీళ్లు నిధులు నియామకాల పంచాయితీ మీద. ఇందులో మొదటిది నీళ్లు. విభజన జరిగితే నీటి యుద్దాలు ఖాయమని, మనతో మనమే కొట్లాడుకుంటామని అప్పట్లో వచ్చిన విమర్శలను విభజనవాదులు పట్టించు కోలేదు. సరికదా కేంద్రం చోద్యం చూస్తోంది. దీనికి గోదావరీ,కృష్ణా జలలాల వివాదమే నిదర్శనం. ఇరు రాష్ట్రాలకు ఆమోద యోగ్యంగా ఈ వివాదం పరిష్కరించడంలో కేంద్రజలశక్తి సంఘం పూర్తిగా విఫల మయ్యింది. పూతమందు లాగా అప్పటికప్పుడు ఏదో ఒక పరిష్కారం చూపి తప్పించు కుంటోంది. ఇది అన్ని రాష్ట్రాల విషయంలో అలాగే ఉంటుంది. స్పష్టమైన జలవిధానం అవలంబించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఇంకా చెప్పాలంటే జాతీయ జలవిధానం, నదుల అనుసంధానం అంశాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. రెండురాష్ట్రాల మీదుగా ప్రవహిస్తున్న కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్ల వాటాలు తేలక..పాలి పంచాయితీల్లాగా సాగుతున్నాయి. వివాదాల పరిష్కారం కోసం కెఆర్‌ఎంబీ, జీఆర్‌ఎంబీ పేర్లతో మేనేజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేసినా.. అవన్నీ ఉన్నా లేనట్టు.. ఉత్సవ విగ్రహాలుగానే మిగిలి పోతున్నాయి. ఎవరి రాష్ట్ర ప్రయోజనాలను వాళ్లు ఏకరూవు పెట్టుకుంటూ.. వాళ్ల వాళ్ల రాష్ట్రాల్లో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయి. దీంతో సమస్య సజీవంగా ఉంటూ వస్తోంది. ముఖ్యంగా తెలంగాణ గడ్డమీద నీటి కటకట తీవ్రస్థాయిలో ఉంది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకున్నారు. సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా అనేక జిల్లాల్లో తాగునీటి అవసరాలు తీరనేలేదు. దీంతో సహజంగానే కృష్ణా నదీజలాల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పుడే కాదు.. ఖరీఫ్, రబీ సీజన్లు మొదలయ్యే వేసవికాలం వస్తుందంటే చాలు ఏటా ఇవే ఒత్తిళ్లు ఉంటున్నాయి.

## పదేళ్లయినా కొలిక్కిరాని పంచాయితీ

**శ్రీశైలం:** శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లపై పట్టు కోసం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం కొలిక్కి వచ్చేలా లేదు. ఇప్పటికీ రెండు రాష్ట్రాలు కలబడుతూనే ఉన్నాయి. 2023 డిసెంబర్ మొదటి వారంలో సాగర్ డ్యామ్‌పై ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇరు రాష్ట్రాల పోలీసుల మధ్య ఇరిగేషన్ అధికారులు బాహాబాహీని తిలకించారు. నీళ్ల వాటా విషయంలో కేసీఆర్, చంద్రబాబు, జగన్, ఇప్పుడు రేవంత్.. కృష్ణా జలాల వివాదాన్ని జఠిలం చేస్తూనే ఉన్నారు. ఎన్నికలొచ్చిన ప్రతీసారీ ఇదొక ప్రచారాస్త్రంగా కూడా మారుతోంది. నదీ జలాల వివాదాలు.. ఏ రాష్ట్రానికీ కొత్త కాదు. ఏ నదికీ లేనివీ కావు. కావేరీ, నర్మద, మహానది, పెరియార్, మహాదాయి ఇలా వివాదాల్లో చిక్కుకున్న నదుల జాబితా చాంతాడంత. ఆ జాబితాలో తెలుగు రాష్ట్రాల నీటివాటాల గొడవ చాలా ప్రత్యేకం. రెండు రాష్ట్రాలకూ జీవనాధారమైన కృష్ణ, గోదావరి జలాల వివాదం కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖకు పెద్ద సమస్యలా మారింది.

## ప్రియుడితో కలిసి భర్తపై హత్యాయత్నం ఘటన.. చికిత్స పొందుతూ మృతి

వరంగల్: వరంగల్ నగరంలో ఇటీవల వైద్యుడిపై హత్యాయత్నం కేసు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రియుడిపై మోజుతో భర్త(వైద్యుడు)ను మట్టుపెట్టే పన్నాగంలో భాగంగా భార్యే ఈ దారుణానికి పాల్పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్యుడు సుమంత్ రెడ్డి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం ప్రాణాలు కోల్పోయారు.అసలేం జరిగిందంటే..వరంగల్ హంటర్‌రోడ్‌లోని వాసవీకాలనీలో నివాసముంటున్న డాక్టర్ సుమంత్‌రెడ్డికి 2016లో ఫ్లోరా మరియాతో ప్రేమ వివాహమైంది. తన బంధువుల విద్యా సంస్థలను చూసుకునేందుకు 2018లో సుమంత్‌రెడ్డి భార్యతోసహా సంగారెడ్డికి మకాం మార్చారు. అక్కడ ఫ్లోరా ఉపాధ్యాయురాలిగా, సుమంత్‌రెడ్డి పీహెచ్‌సీలో కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్‌గా చేరారు. సంగారెడ్డిలో జిమ్‌కు వెళ్తున్న క్రమంలో ఫ్లోరాకు శిక్షకుడు శామ్యూల్‌తో పరిచయం ఏర్పడి, వివాహేతర సంబంధానికి దారితీసింది.విషయం వైద్యుడికి తెలియడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి... మళ్లీ వరంగల్‌కు మకాం మార్చారు. ఆమెకు 2019లో జనగామ జిల్లా పెంబర్తి సోషల్ వెల్ఫేర్ కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగం వచ్చింది. తర్వాత ఆ కళాశాలను రంగశాయిపేటకు మార్చారు. అయినా, ఫ్లోరా ప్రవర్తనలో మార్పు రాలేదు. భర్త లేనిసమయంలో శామ్యూల్‌ని ఇంటికి పిలిచేది. ఇదే విషయంపై భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవలు జరిగాయి. దాంతో సుమంత్‌రెడ్డిని అడ్డుతొలగించుకోవాలని ఫ్లోరా, శామ్యూల్ నిర్ణయించుకున్నారు. ఇందుకు ఫ్లోరా రూ.లక్ష శామ్యూల్‌కు ఆన్‌లైన్‌లో పంపింది. ఇందులో రూ.50 వేలను శామ్యూల్... సైబరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన స్నేహితుడైన రాజ్‌కుమార్‌కు ఇచ్చాడు. వైద్యుడిని చంపితే ఇల్లు కట్టిస్తానని రాజ్‌కుమార్‌తో ఒప్పందం చేసుకున్నారు. పన్నాగంలో భాగంగా ఈనెల 20న రాత్రి వారిద్దరూ హెల్మెట్ ధరించి బైక్‌పై వరంగల్‌కు చేరుకున్నారు.

కాజీపేటలో ప్రైవేటు ఆసుపత్రిని నడుపుతున్న సుమంత్‌రెడ్డి రాత్రి విధులు ముగించుకొని కారులో ఇంటికి వస్తుండగా బట్టుపల్లిరోడ్‌లో కారు వెనుక భాగంలో సుత్తితో కొట్టారు. శబ్దం విన్న సుమంత్‌రెడ్డి కారును ఆపి బయటికి వచ్చి చూస్తుండగా అదే సుత్తితో పలుమార్లు అతని తలపై మోదారు. చనిపోయాడనుకుని పారిపోయారు. తీవ్ర రక్తస్రావమైన వైద్యుడిని స్థానికులు 108లో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం అతడి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో.. తిరిగి వరంగల్‌కు తీసుకొచ్చారు. ఈ ఘటనపై బాధితుడి తండ్రి సుధాకర్‌రెడ్డి ఫిర్యాదుతో... దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి, నిందితులను గుర్తించారు. ఇంట్లోని బంగారం అమ్మేందుకు వెళ్తున్న శామ్యూల్, రాజ్‌కుమార్, ఫ్లోరా మరియాలను గురువారం అరెస్టు చేశారు. దాడి వెనుక వైద్యుడి భార్యతోపాటు ఆమె ప్రియుడు ఉన్నట్లు తేల్చారు.

## విస్తరణలో నాకు మంత్రి పదవి ఇవ్వండి

హైదరాబాద్:విస్తరణ ఎప్పుడు జరిగినా రంగారెడ్డి జిల్లాకు అవకాశం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో సగం జనాభా.. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోనే ఉన్నారని తెలిపారు. సగం జనాభా ఉన్న చోట ఒక్క మంత్రి కూడా లేడన్నారు. గెలిచిన వాళ్లలో తాను ఒక్కడినే ఉన్నట్లు చెప్పారు. తనకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని పేర్కొన్నారు. సామాజిక వర్గాలకు న్యాయం జరగడం లేదు అనుకుంటే.. తన స్థానంలో ఎవరిని గెలిపించమంటే వాళ్లను గెలిపిస్తానని ప్రకటించారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు కనీసం ఆరుగురు మంత్రులు ఉండేవాళ్లు అని గుర్తుచేశారు. రానున్న గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని స్థానిక నేతలకు మంత్రి పదవి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఇక పార్టీలోకి ఎవరొచ్చినా గౌరవం ఇవ్వాలి.. కానీ పదవులు ఇవ్వొద్దు అని కోరారు. కొత్తగా చేరిన వాళ్లను మంత్రులుగా తీసుకోవద్దని తెలిపారు.

# లక్ష్యా సాధనకు హార్డ్ వర్క్ చేయాలి.






**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి (బిక్కనూరు), మార్చి 1:**

లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా హార్డ్ వర్క్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం రాత్రి భిక్కనూరు ప్రభుత్వ సాంఘీక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో కలెక్టర్ రాత్రి నిద్ర విద్యార్థులతో కలిసి చేశారు. వారితో మమేకం అయిన కలెక్టర్ పరీక్షలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయడంతో పాటు శనివారం ఉదయం యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు.తొలుత కలెక్టర్ కు ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. పదవతరగతి విద్యార్థులను మాథ్స్ లో లెక్కలను బోర్డు పై చేయించి సంతృప్తి చెందారు. హార్డ్ వర్క్ చేయాలని, ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించాలని అన్నారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థులతో ఇంటరాక్ట్ అయి లక్ష్యాన్ని ఎంచుకోవాలని, కష్టపడి ఇష్టపడి చదవాలని అన్నారు. భవిష్యత్తులో ఏమవుతారని ఇంటర్ బైపిసి విద్యార్థులను అడిగారు. కార్డియాలజీ, న్యూరోలాజి, డర్మిటాలోజి, వంటి వైద్య వృత్తి చేపడతామని విద్యార్థులు తెలిపారు. ఎంపీసీ విద్యార్థులు కంప్యూటర్ వంటి వృత్తిలో ఎదగాలని తెలిపారు. విద్యార్థులు చిరు ప్రాయం నుండే కష్టపడే తత్వం ఉండాలని తెలిపారు. ఐఐటి, జేఈఈ లకు ప్రిపేర్ కావాలని, అవసరమైన మెటీరియల్ సమకూర్చుతామని తెలిపారు. అనంతరం పలు తరగతుల విద్యార్థులతో కలిశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిని రజిత, తహసీల్దార్ శివ ప్రసాద్, ఎంపీడీఓ రాజ్ కిరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పిలుపు.**

**భిక్కనూరు ప్రభుత్వ సాంఘీక**

**సంక్షేమ కళాశాలలో రాత్రి నిద్ర.**

**విద్యార్థులతో మమేకం అయి, పరీక్షలపై సలహాలు.**

# సాలుర పీ.హెచ్.సీని తనిఖీ చేసిన కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 01**



: సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ఇన్ పేషంట్ వార్డును సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను గమనించారు. రోగులను పలుకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఇటీవలి కాలంలో పీ.హెచ్.సీ ని సందర్శించారా అని ఆరా తీశారు. సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కాగా, శిథిల దశకు చేరుకున్న పీ.హెచ్.సీ పాత భవనాన్ని పరిశీలించిన జిల్లా పాలనాధికారి, కొత్త భవనం మంజూరీ వివరాల గురించి ఆరా తీశారు. వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ కుమార్ తదతరులు ఉన్నారు.

# నడిరోడ్డుపై భార్య గొంతు కోసి హత్య.

- తనను తాను పొడుచుకొని అత్మహత్యకు పాల్పడ్డ భర్త.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 1:**




నడిరోడ్డుపై భార్య గొంతు కోసి హత్య చేశాడు ఓ భర్త. అనంతరం తానూ కడుపులో పొడుచుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఆర్బీ నగర్ కు చెందిన నర్సింలు, మహేశ్వరి భార్యాభర్తలు. నర్సింలు చౌరస్తాలో గల సులబ్ కాంప్లెక్స్ పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ డబ్బుల గురించి వివాదం నడుస్తున్నట్టుగా తెలుస్తోంది. డబ్బుల విషయమై నర్సింలు శనివారం చౌరస్తా వద్ద మహేశ్వరితో గొడవ పడ్డాడు. అనంతరం వెంట తెచ్చుకున్న చాకుతో మహేశ్వరి గొంతు కోశాడు. ఆపై తానూ కడుపులో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వెంటనే నర్సింలును ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ తరలించారు. ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కుటుంబ కలహాలతో హత్య చేసినట్లుగా ప్రాథమిక విచారణలో తెలిసిందని సీఐ పేర్కొన్నారు.

# సాగునీటి సమస్య తలెత్తితే... అధికారులదే బాధ్యత.




**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టీకరణ.**

**అలసత్వాన్ని ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 01**

జిల్లాలో ఎక్కడైనా సాగు నీటి సమస్య ఉత్పన్నమైతే, సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. విధుల పట్ల అలసత్వ వైఖరిని ప్రదర్శిస్తూ సాగునీటి సరఫరాను సక్రమంగా పర్యవేక్షించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బోధన్ పట్టణంలోని నీటిపారుదల శాఖ అతిథి గృహంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి కలెక్టర్ శనివారం ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాజెక్టులు, చెరువులు, కాల్వల కింద ఆయకట్టు కలిగిన పంటల పరిస్థితి, అందుబాటులో ఉన్న సాగునీటి వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. గతేడాదితో పోలిస్తే ప్రధాన జలాశయాలైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్ లతో పాటు చెరువులలో నీటి నిల్వలు ఈసారి ఒకింత ఎక్కువ మొత్తంలోనే అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పంటలకు సాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యత సరిపడా ఉన్నందున సాగు జలాల పంపిణీని పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగు జలాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ జరపాలని, ఎగువ ప్రాంతాలలో నీటి చౌర్యం జరుగకుండా నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఈ విషయంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని హితవు పలికారు. ఎక్కడైనా నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంటే, ముందస్తుగానే గుర్తించి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. సమస్య ఏర్పడిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా

వ్యవహరించాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుతం పంటలకు సాగు నీటి ఆవశ్యకత ఉంటుందని, వచ్చే నెలన్నర రోజుల పాటు సాగునీటి పంపిణీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. సాగునీటి పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇరిగేషన్ సీ.ఈ లకు సూచించారు. సాగు జలాల పంపిణీ రైతులతో, పంటల సాగు అంశాలతో ముడిపడి ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోకూడదని అన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య సైతం నెలకొనకుండా అప్రమత్తతతో కూడిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత యాసంగి సీజన్ లో ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గత సీజన్లతో పోలిస్తే ఈసారి ఎరువులకు పెద్ద ఎత్తున డిమాండ్ నెలకొని ఉందన్నారు. గతేడాది రబీలో 63 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగించగా, ఈసారి 77 వేల మెట్రిక్ టన్నులకు ఎరువుల డిమాండ్ పెరిగిందని వివరించారు. దీని దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని రైతాంగం అవసరాలకు సరిపడా ఎరువుల స్టాక్ ను ముందుగానే తెప్పించుకుని, అన్ని ప్రాంతాల రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

**పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి**

ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న దృష్ట్యా పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో పాటు ఇతర సంస్థల నుండి రావాల్సిన ఆస్తి పన్నును ఆర్థిక సంవంత్సరం ముగిసేలోపు నూటికి నూరు శాతం వసూలు చేసేలా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉన్న వారికి నోటీసులు జారీ చేయాలని,

అయినప్పటికీ స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సాంకేతికత సహాయంతో ఆస్తి పన్నును పక్కాగా లెక్కిస్తూ, నూటికి నూరు శాతం వసూలయ్యేలా చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గురువు "గూగుల్ " కంటే గొప్పవాడు.

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైకాలజిస్టు తిరునగరి శ్రీహరి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 1**



సమాజంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, గురువు "గూగుల్" కంటే గొప్పవాడు అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైకాలజిస్టు తిరునగరి శ్రీహరి అన్నారు. ఉపాధ్యాయుడు సమాజానికి హృదయం వంటి వాడు అని, ఆదర్శవంతమైన ఉపాధ్యాయుడు అద్భుతమైన పిల్లలను తయారు చేయగలడు అని ఆయన పేర్కొన్నారు. జెసిఐ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల(డైట్) లో ఛాత్రోపాధ్యాయులకు ఉపాధ్యాయ సాధికారత, ఉపాధ్యాయుడు మార్గనిర్దేశకుడు అనే అంశంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. సైకాలజిస్టు తిరునగరి శ్రీహరి చాత్రోపాధ్యాయులకు బోధనలోని మెలకువలు, ఉపాధ్యాయులకు ఉండాల్సిన లక్షణాలు, విద్యార్థులపై బోధన ప్రభావం అనే అంశాలను తెలియజేశారు. ప్రతి ఉపాధ్యాయునికి అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శ జీవితం ప్రేరణదాయక మని అన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుకోవెల శ్రీనివాస్, లయన్స్ క్లబ్ జోన్ చైర్మెన్ జిల్కర్ విజయానంద్, పూర్వాధ్యక్షులు చింతల గంగాదాస్, ప్రోగ్రామ్ చైర్మెన్ అంకం రాజేందర్ పాల్గొన్నారు.

# యువత చేతిలో "విజ్ఞాన శాస్త్ర" అభివృద్ధి.

## ఉస్మానియా యూనివర్సిటీ ప్రొపెసర్ శివరాజ్.

## టియు సౌత్ క్యాంపస్ లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సెమినార్.

**వేగుచుక్క న్యూస్, బిక్నూర్, మార్చి 1:**








భారత దేశ విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి యువత చేతిలోనే ఆధారపడి ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొపెసర్ శివరాజ్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం టియు సౌత్ క్యాంపస్ లో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొ" శివరాజ్ మాట్లాడారు. సర్ సీవీ రామన్ "రామన్ ఎఫెక్టు" అనే అంశంపై చేసిన పరిశోధనల ఫలితంగా శాస్త్ర విజ్ఞానం లో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. అనేక నూతన ఆవిష్కరణలకు అది ఊతం ఇచ్చిందని అన్నారు. ఆ ఆవిష్కరణకు సీవి రామన్ కు దేశంలోనే మొదటగా నోబెల్ బహుమతి వచ్చిందని పేర్కొన్నారు. అందుకే ఈ ప్రయోగం ఫలించిన రోజైన ఫిబ్రవరి 28 న జాతీయ సైన్స్ దినోత్సవం గా జరుపుకుంటున్నాము అని అన్నారు. ఈ సంవత్సరం థీమ్ ప్రకారం యువత నైపుణ్యాలు పెంచుకొని వికసిత భారత్ కోసం శాస్త్ర విజ్ఞాన రంగంలో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.మరో అతిథి ప్రో. మధుకర్ మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్ర వేత్తలను ఆదర్శంగా తీసుకొని రీసెర్చ్ లో ముందుకెళ్లాలని కోరారు. ప్రశ్న నుంచి కొత్త ఆలోచనలు ఉద్భవిస్తాయి అని అన్నారు. ప్రకృతిలో జరుగుతున్న అనేక విషయాలపై ప్రశ్నలు వేసుకుంటూ సమాధానం కోసం పరిశోధన నిర్వహించాలని సూచించారు. తద్వారా కొత్త ఆవిష్కరణలు చేసి సమాజానికి అందించాలని కోరారు.

సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డా. సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు యూనివర్సిటీ లో ఉన్న సౌకర్యాలను వాడుకుంటూ పరిశోధకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. ఫిజిక్స్ విభాగం అధ్యక్షులు డా. మోహన్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు యూనివర్సిటీ లో అధ్యాపకుల సహకారంతో పరిశోధనల్లో ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమానికి ఫిజిక్స్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డా. హరిత లక్కరాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.రాజేశ్వరి, ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు డా. లలిత, వైశాలి, డా.సరిత పిట్ల, దిలీప్, డా.శ్రీమాత, కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు డా.నాగరాజు, గర్ల్స్ హాస్టల్ వార్డెన్ డా. సునీత,బాయ్స్ హాస్టల్ వార్డెన్ డా. యాలాద్రీ, డా. నారాయణ, డా.రమాదేవి, డా. నిరంజన్ శర్మ, డా.ఇంద్రకరణ్, డా.కిషన్, డా.శ్రీకాంత్, డా.కనకయ్య డా.సునీల్ పరిశోధక విద్యార్థులు డా.రాహుల్ , డా.సంతోష్ గౌడ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నువ్వే నా స్ఫూర్తి..





ప్రీతమ్ జుకల్కర్, సమంత మధ్య ఉండే రిలేషన్ అందరికీ తెలిసిందే. అసలు ప్రీతమ్ వల్లే సమంతకు విడాకులు అయ్యాయ్ అనే రూమర్లు కూడా వచ్చాయి. అయితే ప్రీతమ్ మాత్రం తాను సమంతను ఎప్పుడూ సోదరిభావంతోనే చూశానని, సోదరి అని పిలుస్తాను అంటూ చెప్పుకొచ్చాడు. ఇక సమంత నటిగా 15 ఏళ్లు కంప్లీట్ చేసుకున్న సందర్భంగా ప్రీతమ్ పోస్ట్ వేశాడు.

సమంత ఏ మాయ చేశావే సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సమంత నటిగా మొదలు పెట్టి 15 ఏళ్లు అవుతోంది. ఈ పదిహేనేళ్ల కెరీర్ మీద సమంత స్టైలిస్ట్ ప్రీతమ్ జుకల్కర్ స్పందించాడు. సమంత, ప్రీతమ్ రిలేషన్ మీద ఒకప్పుడు దారుణమైన విమర్శలు వచ్చాయి. సమంత, నాగ చైతన్య విడిపోవడానికి కారణం కూడా ప్రీతమ్ అని అన్నారు. కానీ చివరకు ప్రీతమ్ నోరు విప్పాడు. నేను సమంతను అక్కా అని సంభోదిస్తాను.. ఈ విషయం చైతన్యకి కూడా తెలుసు.. ఆయన నోరు విప్పకపోవడం బాధగా అనిపించింది అంటూ ప్రీతమ్ నేషనల్ మీడియాతో ముచ్చటించిన సంగతి తెలిసిందే. తాజాగా సమంతపై ప్రీతమ్ పోస్ట్ వేశాడు. ఏ మాయ చేశావే రిలీజ్ అయి 15 ఏళ్లు అయిన సందర్భంగా.. నటిగా సమంతకు 15 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ప్రీతమ్ వేసిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. నువ్వెల్లప్పుడూ నాలో స్ఫూర్తినింపుతావ్.. కేవలం నాకు మాత్రమే కాదు.. చాలా మందికి స్ఫూర్తినిస్తుంటావ్.. నా లైఫ్, కెరీర్‌కు నువ్వే మూలస్థంభం.. నీ జర్నీలో నేను భాగమైనందుకు ఎంతో గర్విస్తుంటాను.. నీకు ఎంత రుణపడి ఉన్నానో.. మాటల్లో చెప్పలేను.. నువ్వింకా ఇలా ఎంతో సాధించాలి.. ఇంకెంతో ముందుకు వెళ్తుండాలని కోరుకుంటున్నాను అని ప్రీతమ్ పోస్ట్ వేశాడు.

ప్రీతమ్ ఒళ్లో కాళ్లు పెట్టుకుని సోఫాలో సమంత పడుకుని ఉన్న ఓ ఫోటో టాలీవుడ్‌ను, సోషల్ మీడియాను షేక్ చేసింది. అదే వీరిద్దరి మొదటి ఫోటో.. అందులో లవ్యూ అని కూడాపెట్టడం.. వారిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం గురించి రకరకాలుగా మాట్లాడుకున్నారు. అయితే కొంత సేపటికే ఆ ఫోటోను సమంత డిలీట్ చేసింది. కానీ అంతలోపే జరగాల్సిన నష్టం జరిగింది.



# ఆస్కార్ అవార్డ్ మీదే కన్నేసిందిగా!

టాలీవుడ్ హీరో నితిన్ బ్లాక్ బస్టర్ కొట్టి చాలా కాలమైంది. 'చెక్' 'మాస్ట్రో' 'మాచర్ల నియోజకవర్గం' 'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర ఫెయిల్ అయ్యాయి. దీంతో ఈసారి ఎలాగైనా సక్సెస్ ట్రాక్ ఎక్కాలని గట్టిగా ఫిక్స్ అయిన నితిన్.. ఇప్పుడు శ్రీలీలతో కలిసి 'రాబిన్ హుడ్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నాడు. మార్చి నెలాఖరున ఈ సినిమా రిలీజ్ కానుంది. తాజాగా మేకర్స్ ఓ ఫన్నీ మేకింగ్ వీడియోని పంచుకున్నారు.

నితిన్, శ్రీలీల హీరో హీరోయిన్లుగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాబిన్ హుడ్'. 'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్' తర్వాత వీరిద్దరూ జంటగా నటిస్తున్న సినిమా ఇది. వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఇప్పటికే దాదాపుగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. మార్చి 28న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మహా శివరాత్రి సందర్భంగా చిత్ర యూనిట్ ఓ మేకింగ్ వీడియోని సోషల్ మీడియాలో షేర్ చేసారు.

'రాబిన్‌హుడ్' తెరవెనుక ఉన్న జరిగిన సన్నివేశాలను చూపించే ఈ మేకింగ్ వీడియో ఆకట్టుకుంటోంది. ఎంతో ఉత్సాహంగా, సందడి వాతావరణంలో ఈ షూటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. నటీనటులు, టెక్నిషియన్స్ మధ్య ఎలాంటి స్ట్రాంగ్ బాండింగ్ ఉందనేది కూడా ఈ వీడియోలో కనిపిస్తోంది. సెట్‌లో ఒకరు మీద ఒకరు జోకులు వేసుకుంటూ, ఎంజాయ్ చేస్తూ షూట్ చేసినట్లుగా అర్థమవుతోంది. ఈ సందర్భంగా "నాకు ఆస్కార్ రావాలి" అని శ్రీలీల ఫన్నీగా అనడమే కాదు.. మైక్ తీసుకొని పాట పాడటాన్ని కూడా మనం చూడొచ్చు. దీనికి నెటిజన్లు స్పందిస్తూ.. శ్రీలీల ఆస్కార్ అవార్డ్ మీదే కన్నేసిందిగా అంటూ ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు.

అలానే "సాంగ్ చాలా బాగుంది, మిగిలింది ఏమీ లేదు" అంటూ శ్రీలీలను నితిన్ ఎగతాళి చేయడాన్ని.. బాతు డ్యాన్స్ అని కొరియోగ్రఫీపై కామెంట్స్ చేయడాన్ని ఈ వీడియోలో చూపించారు. "ఇది జస్ట్ బిగినింగ్ మాత్రమే అని.. థియేటర్లలో ఎంటర్టైనింగ్ అడ్వెంచర్ ప్రారంభం కావడానికి ఇంకా 30 రోజులు మాత్రమే ఉంది" అని మేకర్స్ పేర్కొన్నారు. ఓ యాక్షన్ అడ్వెంచర్ హీస్ట్ కామెడీగా 'రాబిన్‌హుడ్' సినిమా రూపొందుతోంది. ఇందులో నితిన్ ధనవంతులను దోచుకునే హనీసింగ్ గా కనిపిస్తే.. ధనవంతురా లైన యువతిగా శ్రీలీల కనిపించనుంది. ఇందులో రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్. మైమ్ గోపీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజర్ సినిమాపై ఇంట్రెస్ట్ కలిగించింది. దీనికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. కోటి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఐదేళ్ల తర్వాత 'రాబిన్ హుడ్' ఎలాంటి సక్సెస్ సాధిస్తుందో చూడాలి.



# నెటిజన్ కొంటె కామెంట్..

స్టార్ హీరో సూర్యని వివాహం చేసుకున్న నటి జ్యోతిక.. కోవిడ్ పాండమిక్ కి ముందు తన సెకండ్ ఇన్నింగ్స్ ను స్టార్ట్ చేసింది. ఓవైపు సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తోంది. హిందీ సినిమాల మీద ఫోకస్ పెట్టి, చెన్నై నుంచి ముంబైకి మకాం మార్చేసింది. ఇప్పటికే 'షైతాన్' చిత్రంతో మంచి విజయం సాధించింది. సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉండే జ్యోతిక.. 'డబ్బా కార్టెల్' ప్రమోషన్స్ లో భాగంగా కొన్ని ఫోటోలను ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసింది. నెటిజన్లు పెట్టే కామెంట్స్ కి తనదైన శైలిలో సమాధానమిచ్చింది.

హీరో సూర్య భార్య, నటి జ్యోతిక గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. గతంలో తెలుగు తమిళంతో పాటు అన్ని ప్రధాన భాషల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో కింగ్ అక్కినేని నాగార్జునతో 'మాస్'.. మెగాస్టార్ చిరంజీవితో 'ఠాగూర్' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో హీరోయిన్ గా నటించింది. పెళ్లి తర్వాత కొన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ లో అదరగొడుతోంది. ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్ట్స్ లో నటిస్తోన్న జ్యో.. సోషల్ మీడియాలో నెటిజన్ల కామెంట్లకు రిప్లై ఇచ్చింది.

జ్యోతిక ప్రధాన పాత్రలో నటించిన 'డబ్బా కార్టెల్' వెబ్ మూవీ స్ట్రీమింగ్ కు రెడీ అయింది. ప్రమోషన్స్ లో భాగంగా గత కొన్ని రోజులుగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తోంది. ఇందులో భాగంగా తన లేటెస్ట్ ఫొటోలను ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేసింది. వీటిపై నెటిజన్లు రకరకాల కామెంట్స్ పెడుతున్నారు. "46 ఏళ్ళ వయసులోనూ 16 ఏళ్ళ అమ్మాయిలా కనిపిస్తున్నావ్" అంటూ ఆంధ్రప్రదేశ్ కి చెందిన ఓ అభిమాని కామెంట్ పెట్టాడు. దీనికి జ్యోతిక స్పందిస్తూ హార్ట్ సింబల్ ఎమోజీని పోస్ట్ చేసింది."గత 20 ఏళ్లలో ఇదే బెస్ట్ లుక్" అని మరొకరు కామెంట్ పెట్టగా.. వర్కౌట్ చేయడం, డైట్ ఫాలో అవ్వడం వల్లనే ఇది సాధ్యమైందని జ్యోతిక సమాధానమిచ్చింది. బ్యూటీ సీక్రెట్ ఏంటని ఇంకో నెటిజన్ కామెంట్ పెట్టగా.. ఎల్లప్పుడూ తనను తాను హ్యాపీగా ఉంచుకోవడమే దీనికి కారణమని చెప్పింది. తన భర్త సూర్య కంటే 'డ్రాగన్' హీరో ప్రదీప్ రంగనాథన్, విజయ్ బెటర్ అంటూ ఓ నెటిజన్ ట్రోల్ చేయగా.. ఫన్నీగా ఉందనే అర్థం వచ్చేలా స్మైలీ ఎమోజీని రిప్లైగా పెట్టింది. అయితే ఆ వ్యక్తి వెంటనే తన కామెంట్ ను డిలీట్ చేసాడు. అప్పటికే ఈ కామెంట్స్, జ్యోతిక జవాబులు నెట్టింట వైరల్ గా మారాయి.

సినిమాల విషయానికొస్తే, రీఎంట్రీ తర్వాత జ్యోతిక బాలీవుడ్ మీద ఫోకస్ పెట్టింది. అజయ్ దేవగన్, ఆర్. మాధవన్ లతో కలిసి 'షైతాన్' అనే హారర్ మూవీలో నటించింది. దాదాపు 23 ఏళ్ళ తర్వాత జ్యో చేసిన హిందీ చిత్రమిది. బాక్సాఫీస్ దగ్గర మంచి విజయం సాధించింది. ఆ వెంటనే రాజ్ కుమార్ రావు 'శ్రీకాంత్' సినిమాలో కీలక పాత్ర పోషించి ప్రశంసలు అందుకుంది. ఇక ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన 'డబ్బా కార్టెల్' మూవీ ప్రముఖ ఓటీటీ ఫ్లాట్ ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ఫిబ్రవరి 28వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఇందులో సీనియర్ నటి షబానా అజ్మీ, 'అర్జున్ రెడ్డి' హీరోయిన్ షాలిని పాండే ఇతర పాత్రల్లో నటించారు.

# ఈ టాలెంట్ కూడా ఉందా?

హీరో రామ్ ప్రస్తుతం కెరీర్‌లో కాస్త వెనుక పడ్డాడనే చెప్పుకోవచ్చు. సరైన హిట్టు కొట్టి చాలా కాలమే అవుతుంది. మాస్ ఇమేజ్ కోసం పరితపిస్తూ ఇన్నేళ్లు కష్టపడ్డ రామ్.. ఇప్పుడు రూట్ మార్చినట్టుగా కనిపిస్తోంది. మహేష్ బాబు. పి దర్శకత్వంలో ఓ ఫీల్ గుడ్ రొమాంటిక్ మూవీని చేస్తున్నాడు. స్కంధ తరువాత రామ్ మీద ఎన్ని రకాల విమర్శలు వచ్చాయో అందరికీ తెలిసిందే. ఇక ఇప్పుడు తనకు సూట్ అయ్యే కథలతో రామ్ రాబోతోన్నాడనిపిస్తోంది.

హీరో రామ్ ప్రస్తుతం రూట్ మార్చాడు. రామ్‌కి లేడీస్‌లో ఉన్న ఫాలోయింగ్ అందరికీ తెలిసిందే. చాక్లెట్ బాయ్ ఇమేజ్‌గా రామ్‌కి ఉన్న ఫాలోయింగ్‌కు భిన్నంగా ప్రయత్నాలు చేస్తూ వచ్చాడు. కెరీర్‌లో మాస్ ఇమేజ్ కోసం కూడా రామ్ ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే బోయపాటి శ్రీనుతో కలిసి స్కంధ మూవీని చేశాడు. ఇది ట్రోలింగ్ మెటీరియల్‌గా మిగిలింది. అయితే పెట్టిన డబ్బులు కూడా వచ్చినట్టుగా తెలుస్తోంది. ఇక ఈ మూవీకి సీక్వెల్ ఉంటుందని అప్పట్లోనే ప్రకటించారు.

స్కంధ 2 వస్తుందా? లేదా? అన్నది పక్కన పెడితే.. ఇప్పుడు మాత్రం రామ్ పూర్తిగా మారిపోయాడు. కూల్ లుక్స్‌లో కనిపిస్తున్నాడు. ఓ పది, పదిహేనేళ్లు వెనక్కి వెళ్లినట్టుగా అనిపిస్తోంది. కాలేజ్, లవ్ అంటూ మళ్లీ వెనక్కి వెళ్లినట్టుగా ఉన్నాడు. ప్రస్తుతం రామ్ లుక్స్ చూస్తేనే మంచి రొమాంటిక్ లవ్ స్టోరీని చేస్తున్నాడని అర్థం అవుతోంది. రీసెంట్‌గానే పాలిటెక్నిక్ కాలేజ్‌లో షూట్ చేసిన సంగతి తెలిసిందే.



రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోనూ ఈ మూవీ షూటింగ్ జరుగుతోంది. రీసెంట్‌గా ఏపీ మినిస్టర్ కందుల దుర్గేశ్ కూడా రామ్‌ను మర్యాదపూర్వకంగా సెట్‌లో కలిశాడన్న సంగతి తెలిసిందే. ఇక ఈ మూవీకి సంబంధించిన ఓ వార్త కూడా ఇప్పుడు చక్కర్లు కొడుతోంది. రామ్ ప్రస్తుతం తన పెన్ను కదిలించాడు. హీరోలు పాటలు పాడటం సహజంగా మారింది. కానీ హీరో పాటలు రాయడం అన్నిసార్లు కుదరదు. మరీ ముఖ్యంగా తెలుగులో అయితే ఇలాంటివి జరగదు.

ప్రస్తుతం రామ్.. తన కొత్త చిత్రానికి ఓ లవ్ సాంగ్‌ను రాశారట. ఈ మేరకు రామ్ కొత్త చిత్రానికి సంబంధించిన ఈ అప్డేట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. మరి రామ్ రాసిన ఆ లిరిక్స్, పాట ఎలా ఉంటుందో అని అంతా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రాని మైత్రీ మూవీస్ గ్రాండ్‌గా నిర్మిస్తోంది. ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్య శ్రీ నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం ఇదే ఏడాదిలో ఆడియెన్స్ ముందుకు రానుంది.



# ఆయన రూపమే గుర్తుకు వస్తుంది

మంచు మోహన్ బాబు సమర్పణలో, ఆయన పెద్ద కొడుకు మంచు విష్ణు హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'కన్నప్ప'. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ ఎపిక్ హిస్టారికల్ డ్రామా ఏప్రిల్ 25న రిలీజ్ కానుంది. ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ముంబైలో ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షయ్ కుమార్ ను ఉద్దేశించి విష్ణు కీలక వ్యాఖ్యలు చేసారు. మంచు విష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కన్నప్ప'. ఇందులో రెబల్ స్టార్ ప్రభాస్ రుద్ర అనే పవర్ ఫుల్ పాత్రలో నటిస్తుండగా.. శివుడి పాత్రను బాలీవుడ్ యాక్టర్ అక్షయ్ కుమార్ పోషించాడు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై జనాల్లో ఆసక్తిని కలిగించింది. 'శివా శివా శంకరా' పాట బాగా వైరల్ అయింది. విష్ణు కెరీర్ కు కీలకమైన సినిమా కావడంతో తెలుగులోనే కాకుండా ఇతర భాషల్లోనూ దూకుడుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. తాజాగా ముంబైలో ఓ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షయ్ కుమార్‌పై విష్ణు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

'కన్నప్ప' మూవీ హిందీ ఈవెంట్ కు మంచు విష్ణుతో పాటుగా అక్షయ్ కుమార్, సీనియర్ నటి మధుబాల హాజరయ్యారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ "అక్షయ్ కుమార్ తో ఇంతకముందు నాకు పర్సనల్ రిలేషన్ షిప్ లేదు. కానీ ఇలాంటి గొప్ప మనిషిని కలిసినందుకు నేను గ్రేట్ ఫుల్ గా ఫీల్ అవుతున్నా. ఒక యాక్టర్ గా నేను ఆయన ముందు చాలా చిన్నవాడిని. సెట్స్ లో నేను ఆయన్నుంచి చాలా నేర్చుకున్నాను. ఇండియాలోని సూపర్ స్టార్స్ లో ఆయనొకరు. క్రమశిక్షణ, సినిమా పట్ల ఉన్న అంకితభావమే అక్షయ్ ను సూపర్ స్టార్ ని చేశాయని అనుకుంటున్నాను" అని అన్నారు.

"ఈ తరంలో శివుడి గురించి ఎవరు ఆలోచించినా అక్షయ్ కుమార్ రూపమే ముందుగా గుర్తుకు వస్తుందని నేను కాన్ఫిడెంట్ గా చెబుతున్నా. ఆయన ఆ పాత్రను అంత అద్భుతంగా పోషించాడు" అని మంచు విష్ణు తెలిపారు. తాను మోహన్ బాబు కొడుకునని చెప్పడానికి గర్వపడతానని, ఆయన లేకపోతే తానొక యాక్టర్ అయ్యేవాడిని కాదని అన్నారు. తన తండ్రి కారణంగానే అక్షయ్ కుమార్ ఈ చిత్రంలో నటించాడని చెప్పారు. కన్నప్ప సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ వంద శాతం వారి పాత్రలకు న్యాయం చేశారు.. మోహన్ లాల్, ప్రభాస్ అందరూ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారని విష్ణు చెప్పుకొచ్చారు.

'కన్నప్ప' ఆఫర్ ను రెండు సార్లు రిజెక్ట్ చేసినట్లు అక్షయ్ కుమార్ చెప్పారు. మోహన్ బాబు, విష్ణు తనకు ఎన్నోసార్లు కాల్ చేశారని, కానీ బిజీగా ఉండడంతో మాట్లాడలేకపోయానని చెప్పారు. అయితే ఇద్దరూ తన ఆఫీసుకు వచ్చి కలిసి మాట్లాడిన వెంటనే ఓకే చెప్పానని, విష్ణు మాటల్లో నిజాయతీ కనిపించిందని అక్షయ్ అన్నారు. మార్చి 1న అన్ని భాషల్లోనూ టీజర్ రిలీజ్ అవుతుందని ప్రకటించారు.

ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో 'కన్నప్ప' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో విష్ణు సరసన ప్రీతి ముకుందన్ హీరోయిన్ గా నటిస్తోంది. మోహన్ లాల్, కాజల్ అగర్వాల్, శరత్ కుమార్, మంచు మెహన్ బాబు, దేవరాజ్ ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ లో మంచు విష్ణు భారీ బడ్జెట్ తో ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మించారు. ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.

# గుడ్ బ్యాడ్ అగ్లీ టీజర్ ముహూర్తం ఫిక్స్

అజిత్ పట్టుదల చిత్రం బాక్సా ఫీస్ వద్ద బోల్తా కొట్టింది. అజిత్ పడిన కష్టం అంతా కూడా వృథా అయింది. పట్టుదల సినిమాకు మిక్స్ టాక్ వచ్చింది. ఇక కోలీవుడ్‌లోనూ చెప్పుకోదగ్గ కలెక్షన్స్ రాలేదు. ఇక అజిత్ ఇప్పుడు గుడ్ బ్యాడ్ అగ్లీ అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాడు. ఏప్రిల్ నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో చిత్రయూనిట్ టీజర్ అప్డేట్ వచ్చింది. అజిత్ ప్రస్తుతం గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీతో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాడు. ఫిబ్రవరిలో అజిత్ పట్టుదల అంటూ ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. కానీ ఈ మూవీ అంతగా హిట్టు కాలేదు. ఆడియెన్స్ నుంచి మిశ్రమ స్పందన రావడంతో బాక్సా ఫీస్ వద్ద పెద్దగా వసూళ్లను రాబట్టలేదు. ఇక కోలీవుడ్‌లోనూ పట్టుదల మూవీకి అంతగా కలెక్షన్స్ రాలేదు. ఇక ఇప్పుడు అజిత్ ఇంకో మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతోన్నాడు. ఏప్రిల్ 10న అజిత్ గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీ రాబోతోంది. ఏప్రిల్ 10న రాబోతోన్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ అప్డేట్ ఇచ్చారు. రేపు (ఫిబ్రవరి 28) సాయంత్రం టీజర్‌ను రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల 3 నిమిషాలకు ముహూర్తం ఫిక్స్ చేసినట్టుగా చిత్రయూనిట్ ప్రకటించింది. మరి ఈ టీజర్‌ను పట్టే సినిమా మీద అందరికీ ఓ అంచనా ఏర్పడుతుంది. ఇంత వరకు ఈ మూవీ నుంచి ఎలాంటి హింట్ రాలేదు. అసలు అజిత్‌ను అధిక్ రవిచంద్రన్ ఎలా చూపిస్తాడు? తనకు ఎంతో ఇష్టమైన హీరో అని చెబుతుంటాడు.. అలాంటి వాడు అజిత్‌ను ఎలా చూపించి ఉంటాడు? అని అంతా అనుకుంటున్నారు. మార్క్ ఆంటోని అయితే గ్రాండ్ సక్సెస్ అయింది. విశాల్, ఎస్ జే సూర్యలతో అధిక్ రవిచంద్రన్ తీసిన ఈ మూవీ కోలీవుడ్, టాలీవుడ్ బాక్సాఫీస్‌ని షేక్ చేసింది. ఇక అజిత్‌తో ఈ దర్శకుడు ఎలాంటి జానర్లో సినిమా చేసి ఉంటాడా? అని అంతా ఎదురుచూస్తున్నారు.

